నేటితో ముగియనున్న శిబిరం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ యశోద ఠాకూర్

వెంకటాపూర్, న్యూస్‌టుడే: ఈనెల 15న రామప్పలో మొదలైన వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ల శిక్షణ శిబిరం శనివారంతో ముగియనుందని కాకతీయ హెరిటేజ్ ట్రస్టు కన్వీనర్, ప్రొఫెసర్ పాండురంగారావు అన్నారు. శిబిరంలో శుక్రవారం ఉదయం యోగా గురువు రాంబాబు వాలంటీర్లకు యోగాసనాలు వేయించారు. నృత్య రత్నావళిలోని నాట్యంపై ప్రొఫెసర్ యశోద ఠాగూర్ వివరించారు. ప్రొఫెసర్లు మల్లికార్జున రెడ్డి, రతీష్‌కుమార్ జియోమాఫిక్ స్ట్రక్చర్, హెరిటేజ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం రామప్ప సరస్సు కట్టపై ఉన్న త్రికుటాలయం వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించి ఆలయంపై మెలిచిన పిచ్చిమొక్కలను, చెత్తాచెదారం తొలగించి శుభ్రపరిచారు. కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ అధికారి కుసుమ సూర్యకిరణ్, పురావస్తు, పర్యాటకశాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మంత్రి సురేఖ సైకిల్ సవారీ



రామన్నపేట, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విద్యార్థి దశ రోజులు గుర్తు చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం వరంగల్ ఓసిటీలోని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆంధ్రా బాలిక ఉన్నత పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థినులకు మంత్రి సురేఖ చేతుల మీదుగా కాంగ్రెస్ నాయకుడు మడిపెల్లి కృష్ణగౌడ్ సైకిళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి విద్యార్థినులతో కలిసి క్యాంపు కార్యాలయం వద్ద సైకిల్ తొక్కి సందడి చేశారు. విద్యార్థినులతో స్వీయ చిత్రాలు దిగారు.

నేర నియంత్రణపై దృష్టి సారించాలి


నేర సమీక్షలో సూచనలిస్తున్న ఎస్పీ శబరీష్

ములుగు టౌన్, న్యూస్‌టుడే: గంజాయి తరలిస్తున్న వారిపై నిఘా పెంచాలని జిల్లా పోలీసు అధికారి శబరీష్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు అధికారులతో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. దొంగతనాలు, ఆర్థిక నేరాలలో ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా దర్యాప్తును ముమ్మరం చేయాలన్నారు. పోగొట్టుకున్న నగదు, వస్తువులను బాధితులకు అప్పగించేలా కృషి చేయాలన్నారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో పెద్దఎత్తున సీసీ టీవీ కెమెరాలను అమర్చడం జరిగిందని, గ్రామస్థాయిలో కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు చేయాలని ఎస్సైలకు సూచించారు. ప్రజావాణి, గ్రామసభలలో పోలీసు శాఖకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పోగొట్టుకున్న చరవాణులను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అప్పగించే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

31 వసతి గృహాల్లో అధికారుల రాత్రి బస

ములుగు, న్యూస్‌టుడే: జిల్లాలోని 31 వసతిగృహాల్లో అధికారులు రాత్రి బస చేసినట్లు జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం రాత్రి మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు, ఇతర అధికారులు 31 వసతి గృహాలను తనిఖీ చేసి రాత్రి బస చేసి విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం, ఉదయం అల్పాహారం చేశారన్నారు. వసతి గృహాల్లో అవసరమైన, అత్యవసరమైన మరమ్మతుల వివరాల సేకరణ చేయాలని సూచించినట్లు వివరించారు. అధికారులు విద్యార్థుల స్టడీ అవర్ గమనించారని, విద్యార్థులకు అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, విద్యా బోధన, రోజువారీ దినచర్య, మెనూ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారని చెప్పారు. విద్యార్థుల సామర్థ్యాన్ని కూడా పరిశీలించినట్లు చెప్పారు. స్టోర్ రూంలో నిల్వ ఉంచిన నిత్యావసరాలను తనిఖీ చేశారని, అధికారులు సేకరించిన సమస్యలపై వివరాలతో శనివారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


ములుగు మండలం అబ్బాపురం శివారు బానాలపల్లెకు వెళ్లే రహదారి ఇది. ఈ తారు రోడ్డు నిర్మాణానికి నిధుల అవసరం ఉంది. ప్రస్తుతం కంకరరోడ్డుగా ఉండగా, తారు నిర్మాణం జరగకపోవడంతో ప్రస్తుతం అది మట్టి దారిగా మారుతుండటంతో.. గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అబ్బాపురం-రేగొండ మార్గం నుంచి కిలోమీటరు వరకు ఉంటుంది. ఈ రహదారికి కూడా నిధులు కేటాయిస్తే ఆయా గ్రామాల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది.


తాడ్వాయి మండలం మేడారంలోని మ్యూజియం నుంచి నరియాబంధం గుట్ట దారి ఇది. సుమారు కిలోమీటరు ఉంటుంది. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే మేడారం వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది. మ్యూజియానికి వచ్చే పర్యాటకులు, ఇంగ్లీషు మీడియం పాఠశాలకు వచ్చే విద్యార్థులకు, పోలీసు స్టేషన్, గ్రామ పంచాయతీకి వచ్చే వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

రహదారులకు మహర్దశ

● రూ.20 కోట్లు మంజూరు

ములుగు, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామీణ ప్రాంత రహదారులకు మహర్దశ రానుంది. ములుగు అసెంబ్లీ నియోజకవర్గంలో మార్గాలను, వంతెనల నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేస్తూ. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో రద్దీ అధికంగా ఉండే దారులు, కొన్నేళ్లుగా నిర్మాణానికి నోచుకోని వాటి నిర్మాణం చేయనున్నారు. అనుసంధాన రోడ్లు, అంతర్గత మార్గాలను నిర్మిస్తుండటంతో గిరిజన పల్లెల దారులు బాగుపడనున్నాయి.

● రెండురోజుల క్రితం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ములుగు నియోజకవర్గంలోని గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల పరిధిలోని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ఇందులో నాలుగు వంతెనలు, నాలుగు కిలోమీటర్ల రహదారులు, అంతర్గత రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులకు ఈ నిధులు మంజూరయ్యాయి.

పనుల వివరాలు..

- గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ నుంచి దుంపిల్లగూడెం రోడ్డులో వంతెన నిర్మాణానికి రూ.6.40 కోట్లు
- ఏటూరునాగారం మండలం రాంనగర్‌లో అంతర్గత మురుగు కాల్వల కోసం రూ.కోటి
- తాడ్వాయి మండలం మ్యూజియం నుంచి నరియాబంధం గుట్ట వరకు కిలోమీటరు దారికి రూ.1.30 కోట్లు
- తాడ్వాయి మండలం పంచాయతీరోడ్ నుంచి చింతల్ (వనం రోడ్డు)వరకు అర కిలోమీటరుకు రూ.1.30 కోట్లు.
- కొత్తగూడ మండలం ఎంచగూడెం నుంచి బోరింగ్‌తండా వరకు 2.5కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు
- గంగారం మండలం మామిడిగూడెం నుంచి తాళ్లగుంపు వరకు రోడ్డులో హైలెవెల్ వంతెనకు రూ.1.50 కోట్లు
- గంగారం మండలం దుబ్బగూడెం నుంచి మిర్యాలపేట రోడ్డులో హైలెవెల్ వంతెనకు రూ. 1.50 కోట్లు
- గంగారం మండలం చింతగూడెం నుంచి మహదేవునిగూడెం దారిలో హైలెవెల్ వంతెనకు రూ.3 కోట్లు

మరిన్ని నిధులు



- మంత్రి సీతక్క

గ్రామీణ రోడ్లకు మరిన్ని నిధులు కేటాయించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు చేశాం. క్యాబినెట్‌లో తీర్మానం చేసి ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రూ.1,377 కోట్ల నిధులు విడుదల చేశాం. గతంలో పనులు ప్రారంభించి మధ్యలో వదిలేసిన వాటికి సంబంధించిన బిల్లులను కొద్దికొద్దిగా చెల్లిస్తున్నాం. గత ప్రభుత్వం రూ.40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టడంతో.. పనులు సరిగా జరగలేదు. అలాంటి వాటిని గుర్తించి గుత్తేదార్లకు నోటీసులు జారీ చేస్తున్నాం. అదే గుత్తేదారు పని చేస్తారా? రద్దు చేసి వేరే వారితో చేయించాలా? అనే దానిపై వివరణ అడుగుతున్నాం. పనులు చేయలేమన్న వారికి సంబంధించిన పనులను రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ముందుకొస్తున్న వారికి కొన్ని బిల్లులు కూడా చెల్లిస్తాం.

మహిళల అభ్యున్నతికి వడ్డీలేని రుణాలు


కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట,న్యూస్‌టుడే: రాష్ట్రంలోని మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం జిల్లాలో పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. గోవిందరావుపేట మండలం చల్వాయిలోని ఆదర్శ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. సీఎస్ఆర్ నిధులు, మౌరిటెక్ ఐటీ సంస్థ సౌజన్యంతో 10 కంప్యూటర్లను అందజేశారు. అనంతరం చల్వాయిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉషా కంపెనీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహిళల ఆర్థికాభివృద్ధికి వడ్డీ లేని రుణాలను అందజేస్తుందన్నారు. సక్రమ లావాదేవీలు నిర్వహించి రుణ పరిమితిని పెంచుకోవాలన్నారు. ములుగు జిల్లాకు వెనకబడిన జిల్లాగా పేరుందని, ఈతరం విద్యార్థులు బాగా చదువుకుని అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దాలని కోరారు.

ధరణి తీసేస్తున్నాం.. మోఖా సర్వే చేసి పట్టాలిస్తాం..

వెంకటాపూర్: భూ సమస్యల పరిష్కారం కోసం ధరణి తీసేస్తామని, మోఖా సర్వే చేసి పట్టాలు ఇస్తామని మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని జవహర్‌నగర్‌లో ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించిన రామాలయ ప్రహరీ ప్రారంభోత్సవంలో సీతక్క మాట్లాడారు. వెంకటాపూర్ మండలంలోని జవహర్‌నగర్, లింగాపూర్, ములుగు మండలంలోని బండారుపల్లి గ్రామాల్లో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు రాబోయే రోజుల్లో మోఖా సర్వే చేపట్టి పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమాల్లో కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రవిచందర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టడం నేరం

ములుగు, న్యూస్‌టుడే: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పాన్ ఇండియా రిహాబిలిటేషన్ క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం ములుగులోని మెకానిక్ షెడ్లు, కార్ షెడ్లు, ట్రాక్టర్ షోరూంలు, గ్యాస్ ఏజెన్సీలలో బాల కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. బాల కార్మికులను పనిలో చేర్పించుకోవడం నేరమన్నారు. దుకాణ యజమానులు నియమనిబంధనలు పాటించాలని సూచించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ సభ్యులు బానోతు స్వామిదాస్, రాచర్ల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు



ఈనాడు కథనానికి స్పందన

వాజేడు, న్యూస్‌టుడే: వాజేడులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. 'దోమల మోత.. చలితో వెత..!' శీర్షికన 'ఈనాడు'లో గురువారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించి వసతిగృహాలు, పరిసరాలలో ఫాగింగ్ చేపట్టారు. వారానికోసారి ఫాగింగ్ పనులు చేపట్టాలని ఎంపీవో శ్రీకాంత్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

ఆసక్తిగా తిలకించి.. అవగాహన పెంచుకుని..


విద్యార్థులకు ఆయుధాల గురించి వివరిస్తున్న పోలీసు అధికారి

ములుగు టౌన్, న్యూస్‌టుడే: పోలీసులు ఉపయోగించే ఆయుధాలపై అవగాహన కలిగి ఉండాలని పోలీసు అధికారులు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్ ఆవరణలో ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బాంబు స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్, ట్రాఫిక్, ఆయుధాలు, సైబర్ విభాగం, యాంటీ డ్రగ్స్ విభాగాలను ఏర్పాటు చేయగా విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు వాడుతున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రం
వంతెన కూలింది.. కాలినడకే దిక్కైంది!


వివరాలు 6లో

ధాన్యం విక్రయంలో నిబంధనలు తప్పనిసరి


శిక్షణ కార్యక్రమానికి హాజరైన రైతులు, అధికారులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ధాన్యం విక్రయించే ముందు ప్రభుత్వ నియమాలు కచ్చితంగా నిబంధనలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ సూచించారు. శుక్రవారం ఖరీఫ్ 2024-25 సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు చేసే పద్ధతులపై ఏటూరునాగారంలోని రైతు వేదికలో కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జిలు, బక్ కీపర్లు, వ్యవసాయాధికారులు, ఆదర్శ రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతుల కొనుగోలు, చెల్లింపులకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్లో ఏ విధంగా నమోదు చేయాలో సూచించారు. తేమశాతం గుర్తింపు, దొడ్డు, సన్న రకాల గుర్తింపు ఆన్‌లైన్లో నమోదు, తదితర అంశాలపై వివరించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల నుంచి వచ్చే ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేయాలని, ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ల ద్వారా ట్యాగింగ్ చేసిన మిల్లులకు పంపించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఎఫ్‌ఏక్యూ ప్రమాణాలు పాటించాలని, ఏవైనా అవకతవకలకు పాల్పడితే కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ బి.రాంపతి, పౌర సరఫరాల అధికారి ఫజల్ హుస్సేన్, జిల్లా సహకార అధికారి సర్దార్‌సింగ్, జీసీసీ మేనేజర్ దేవ్, ఏడీఏ చేరాలు, తహసీల్దార్ జగదీష్, వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

దూది రైతుకు దుఃఖమే మిగిలింది!



ఈనాడు, వరంగల్, మహబూబాబాద్
ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే

రైతు ఆశాజీవి.. ఎప్పటికైనా గిట్టుబాటు ధర రాకపోతుందా అని ఆరుగాలం కష్టించి పంట పండిస్తే చివరికి కన్నీరే మిగులుతోంది. ఈసారి అకాల వర్షాలు, చీడపీడల కారణంగా.. ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. దానికితోడు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. మార్కెట్‌లో దళారులు, అధికారులు కుమ్మక్కై ధర తగ్గించి రైతును నిలువునా ముంచుతున్నారు.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పత్తిని అధికంగా పండించే అన్నదాతల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది.

● రాష్ట్రంలోనే పెద్దదైన వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా రైతులు పత్తిని అమ్మకానికి తీసుకొస్తారు. శుక్రవారం ధర పడిపోవడంతో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన నిర్వహించారు. పోలీసులు రంగప్రవేశం చేసి రైతులు, రైతు సంఘాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, మార్కెట్ అధికారులతో చర్చించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మార్కెట్ కార్యదర్శి రైతు సంఘాల నాయకులకు భరోసానివ్వడంతో.. ఆందోళన సద్దుమణిగింది. ఎలాంటి షరతులు లేకుండా సీసీఐ కొనుగోళ్లు చేపట్టాలని, మద్దతు ధర రూ.11 వేలకు పెంచాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సీసీఐ ప్రేక్షక పాత్ర..

వ్యాపారుల చేతుల్లో రైతులు నిలువునా మోసపోతున్నా.. భారత పత్తి సంస్థ ప్రేక్షక పాత్ర పోషిస్తోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పత్తిలో 8 నుంచి 12 తేమ శాతం రాదని తెలిసినా.. తేమశాతాన్ని పెంచేందుకు సీసీఐ నిబంధనలు ఒప్పుకోవని అధికారులు చేతులెత్తేశారు. దాంతో వ్యాపారులు రైతుల కష్టాన్ని అగ్గువకే దోచుకుంటున్నారు. మరోవైపు గ్రామాల్లోనూ దళారులు అక్రమంగా పత్తి కొనుగోళ్లు చేస్తూ.. తిరిగి మార్కెట్‌లో అదే పత్తిని ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.


వేలం పాట నిర్వహిస్తున్న మార్కెట్ సిబ్బంది

మార్కెట్‌లో 'మద్దతు' కరవు

రూ.10 వేలకు అమ్మినా ఏమీ మిగలవు


- అడ్డాల కిషన్‌రావు, రైతు, రేవల్లె, దుగ్గొండి



నాకున్న రెండెకరాల్లో పత్తి వేశాను. శుక్రవారం 8 క్వింటాళ్ల వరకు పత్తి తీసుకువస్తే క్వింటాకు రూ.6600 చెల్లించారు. ఎకరా పత్తి తీయిస్తేనే రూ.4 వేల వరకు ఖర్చయింది. నాలుగుసార్లు పురుగుమందులు, ఇతరత్రా ఖర్చులు కలిపి చాలా ఖర్చయింది. క్వింటా పత్తి రూ.10 వేలకు అమ్మినా మాకు ఏమీ మిగలవు.

రవాణాకే రూ.5 వేలు చెల్లించాను

- రౌతు రాజయ్య, రైతు, కుంటపల్లి, సంగెం



మూడెకరాల్లో పత్తి వేస్తే తొలి కాపులో 15 క్వింటాళ్ల వరకు వచ్చింది. మార్కెట్‌కు తేవడానికి రూ.5 వేలు ఖర్చయింది. కూలీలు రూ.500 ఇస్తేగానీ రావడం లేదు. ఇక్కడ రూ.6500 కంటే తక్కువకే అడుగుతున్నారు. గతేడాది రూ.7 వేలకు పైగా ధర వచ్చింది.

రైతుల ఇబ్బందులపై వివరణ కోరగా
● పత్తి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ సీసీఐ కనీస తేమ 15 నుంచి 20 శాతానికి పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశామని అన్నారు.
● ఎనుమాముల మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల మాట్లాడుతూ వ్యాపారులు తక్కువ ధరకు రైతుల నుంచి సరకును కొనకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పంటను దున్నేస్తున్నారు...!

గత ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాల ప్రభావం పత్తి రైతులను వెంటాడుతోంది. భారీ వర్షాల సమయంలో పత్తి పూత, పిందె రాలిపోయి తెగుళ్ల బారిన పడింది. చివరి ప్రయత్నంగా పురుగు మందులను పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది.



● నర్సింహులపేట మండలం జగ్గుతండా గ్రామశివారు చింతలతండాకు చెందిన రైతు బానోతు బాలాజీ మూడున్నర ఎకరాల్లో పత్తి వేశారు. రూ.లక్ష వరకు పెట్టుబడి వ్యయం చేయగా భారీ వర్షాలతో పూత, పిందెలు రాలిపోయాయి. ఎరువుల దుకాణదారుల సూచన మేరకు పలు రకాల పురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం కానరాలేదు. పది క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి వచ్చింది. పంటకు గులాబీ పురుగు ఆశించడంతో శుక్రవారం ట్రాక్టర్‌తో దున్నించి తొలగించారు.



● గోపాతండాకు చెందిన తాజా మాజీ సర్పంచి అజ్మీర లక్ష్మి రూ.60 వేలు వెచ్చించి రెండెకరాల్లో పత్తి సాగు చేశారు. భారీ వర్షాలకు పంట పూత, పిందెలు రాలిపోయి పెరుగుదల నిలిచిపోయింది. పురుగు మందులు వాడినా ఆరు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. తెగుళ్లు, వానరాల నుంచి కాపాడుకోలేక పంటను పశువులకు మేతకు వదిలేశారు..

–న్యూస్‌టుడే, నర్సింహులపేట

జిల్లాల వారీగా..	వరంగల్	జనగామ	భూపాలపల్లి	మహబూబాబాద్	హనుమకొండ	ములుగు
● ఎకరాలు	1,19,910	1,16,000	93,460	79,632	77,330	20,740
● పత్తి దిగుబడి అంచనా (ఎకరానికి 6 క్వింటాళ్ల చొప్పున)	7,19,460	6,96,000	5,60,760	4,77,792	4,63,980	1,24,441

వంతెన కూలింది.. కాలినడకే దిక్కైంది!



ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు రాకపోకలు మెరుగుపర్చేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి- పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామాల మధ్యలోని మానేరు వాగుపై నిర్మిస్తున్న వంతెన పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నిర్మాణ పనులు జరుగుతుండగానే ఈ ఏడాది ఏప్రిల్, జులైలో రెండుసార్లు వంతెన గడ్డర్లు కూలిపోయాయి. 2016లో రూ.51.60 కోట్లు మంజూరు కాగా.. అప్పటి నుంచి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ క్రమంలో గాలి దుమారానికి ఏప్రిల్‌లో 2-3 పియర్ల మధ్యలో మూడు గడ్డర్లు, జులో 17-18 పియర్ల మధ్యలో 5 గడ్డర్లు కూలిపోయి ధ్వంసమయ్యాయి. అప్పటి నుంచి పనులు నిలిచిపోయాయి. దీంతో రెండువైపులా వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.. కూలీ పనులకు వెళ్లేవారు వాగు వరద ప్రవాహంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.. వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

–ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే టేకుమట్ల



వీరు పెద్దపల్లి జిల్లా ఓడేడు గ్రామానికి చెందిన కూలీలు. నిత్యం 500 మంది వరకు వాగులో నుంచి నడుచుకుంటూ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలానికి కూలీ పనులకు వస్తుంటారు. వాగు ప్రవహిస్తే ఇరువైపులా కాలినడక రాకపోకలు సైతం నిలిచిపోతాయి..

ఈ ప్రయాణం ప్రమాదం



పత్తి పంట దిగుబడులు వస్తుండటంతో వ్యవసాయ కూలీలకు డిమాండ్ పెరిగింది. హనుమకొండ జిల్లా పరకాల నుంచి నిత్యం వందలాది మంది మహిళా కూలీలు ట్రాక్టర్లు, ఆటోల్లో ఇతర గ్రామాలకు వెళ్తున్నారు. వాహనాల్లో పరిమితికి మించి కూలీలను ఎక్కించుకొని తీసుకెళ్తున్నారు. పరకాలలోని వెల్లంపల్లి రోడ్డులో గురువారం కొందరు మహిళలు ఇలా ఆటో వెనుక భాగంలో నిలబడి ప్రమాదకరంగా ప్రయాణించారు. ప్రమాదం జరగకముందే పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. – న్యూస్‌టుడే, పరకాల


నేడు ముదిరాజ్ కుల వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



నర్సంపేట, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాల ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు' పెళ్లి పందిరి. నెట్ ముదిరాజ్ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని రెండు రోజులు నిర్వహిస్తోంది. నర్సంపేట కోర్టు హాలు వెనుక ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ వేదికగా ఈ కార్యక్రమం ఉంటుంది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు అక్టోబరు 26, 27 తేదీల్లో (శని, ఆదివారాల్లో) ఉదయం 9 సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైలను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవాలి. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్‌లో యాప్ ద్వారా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయాల్సిన వధూవరుల బయోడేటా, ఫొటోలు 83744 45190, 80080 02165 వాట్సాప్ నెంబర్లకు పంపించాలి. మరిన్ని వివరాలకు ఆ నంబర్లలో సంప్రదించాలి.


కాళోజీ కళాక్షేత్రం

● అత్యాధునిక హంగులతో నిర్మాణం పూర్తి



రాష్ట్ర సాంస్కృతిక రాజధానిగా పేరొందిన ఓరుగల్లుకు గర్వకారణంగా నిలిచే కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఇది ఉమ్మడి వరంగల్‌కే తలమానికంగా నిలవనుంది. పలుకుబడుల కవితలతో ప్రజాకవిగా.. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి దాతగా పేరొందిన ఓరుగల్లు ముద్దుబిడ్డ కాళోజీ నారాయణరావు స్మారకార్థం హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో కళలకు నిలయంగా ఇది వెలుగొందనుంది.

– న్యూస్‌టుడే, వరంగల్ సాంస్కృతికం



ఓరుగల్లుకు మణిహారం..

- ● మొత్తం విస్తీర్ణం 4.2 ఎకరాలు
- ● నిర్మాణం 4 అంతస్తులు
- ● మొత్తం భవన నిర్మాణం 6172 చదరపు అడుగులు
- ● ప్రహరీతో పాటు గార్డెన్, పార్కింగ్ కలిపి 95,548 చ.అ
- ● వ్యయం రూ.95 కోట్లు



ఆడిటోరియంలో సభావేదిక, పైన విద్యుద్దీపాలు

ప్రాంగణం ఆహ్లాదకరంగా.. కళాక్షేత్రం ఆవరణలో ఆహ్లాదకరమైన గార్డెన్‌తో పాటు పార్కింగ్ సదుపాయం ఉంది. ఇందులో రకరకాల పూలు, అలంకరణ మొక్కలు నాటారు. లోపలికి వెళ్లగానే పచ్చని మొక్కలు స్వాగతం పలుకుతాయి. ప్రవేశమార్గంలో కాళోజీనారాయణ రావు విగ్రహం దర్శనమిస్తుంది.



రవీంద్రభారతికి దీటుగా : హైదరాబాద్ రవీంద్ర భారతికి దీటుగా ఆడిటోరియం ఉంటుంది. రవీంద్రభారతి ఆడిటోరియం సీటింగ్ సామర్థ్యం 980. అదే కళాక్షేత్రంలో 1127 కుర్చీలు ఏర్పాటు చేశారు. ఇందులో అప్పర్ బాల్కనీలో 286 మంది కూర్చోవచ్చు. మిగతావి వరుస క్రమంలో కింద భాగంలో ఉంటాయి. సినిమా టాకీసును మించిన ఆధునిక సదుపాయాలు కల్పించారు. ఆడిటోరియం లోపలికి వెళ్లగానే కళ్లు విప్పారుతాయి. సభావేదికపై కెనరా లైటింగ్స్ ఆడియో, వీడియో సెట్టింగ్స్ చేశారు. స్టేజి వెనుక, ఇరువైపులా బాలురు, బాలికల కోసం 4 గ్రీన్ రూమ్స్, అతిథులు, నిర్వహణ కోసం 12 గదులు ఉన్నాయి. ఒకేసారి 500 మందికి పైగా వేదికపై కూర్చునేలా భారీ వేదిక నిర్మించారు. ప్రవేశ మార్గంలో ఇరు వైపులా సువిశాలమైన కారిడార్స్ నిర్మించారు. నిరంతర విద్యుత్తు సరఫరా కోసం ఆధునిక జనరేటర్ ఏర్పాటు చేశారు. ఆడిటోరియం లోపలికి వెళ్లడం, బయటకు రావడానికి రెండు వైపులా కలిపి ఆరు తలుపులు ఉన్నాయి.






కాళోజీ జ్ఞాపకాలతో ఆర్ట్ గ్యాలరీ


కాళోజీ నారాయణరావు తొలి, మలి దశ ఉద్యమాల్లో పాల్గొన్న చిత్రాలు, ఆయన సాధించిన పురస్కారాలతో ప్రత్యేకంగా ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేశారు. జిల్లాలోని కవులు, కళాకారులతో పాటు ప్రముఖుల చేతుల మీదుగా పొందిన పురస్కారాలు, సరదాగా ముచ్చటించిన అరుదైన చిత్రాలను ఇక్కడ చూడొచ్చు.



గ్రంథాలయం ఏర్పాటు చేయాలి..



కాళోజీ నారాయణరావు 1930 నుంచి గ్రంథాలయోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఉండాలనేది ఆయన ఆకాంక్ష. స్వరాష్ట్ర సాధన కోసం ఆయన అనేక పుస్తకాలు రచించారు. కవితలు, సూక్తులతో ప్రజలను చైతన్యపరిచారు. మరాఠీ, ఆంగ్లం, ఉర్దూ బాషల్లో పండితుడు. అనేక ఇతర భాషా గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. నా భారతదేశ యాత్ర, పార్థివ వ్యయం, కాళోజీ కథలు, నా గొడవ, జీవనగీత, తుది విజయం మనది, తెలంగాణ ఉద్యమ కవితలు, ఇదీ నా గొడవ, బాపూ! బాపూ! బాపూ! లాంటి అనేక కవితా సంపుటాలు రచించారు. ఆయన రచనలతో కళాక్షేత్రంలో ప్రత్యేకంగా గ్రంథాలయం ఏర్పాటు చేస్తే భావి తరాలు వాటి గొప్పతనం తెలుసుకునే అవకాశం ఉంది.



విద్యుత్తు తీగలకు.. ఊతమైన కర్ర



జనగామ మండలం మరిగడి గ్రామంలో పలు చోట్ల వ్యవసాయ బావుల వద్ద విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ప్రస్తుతం వరి కోతల సీజన్ కావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని రైతులు, వరి కోత యంత్రాల యజమానులు ఆందోళన చెందుతున్నారు. గానుగుపహాడ్ మరిగడి రహదారి పక్కన ఓ రైతు పొలంలో 11 కె.వి విద్యుత్తు తీగలు వేలాడుతుండగా, రైతు సైకిల్ టైరులకు ఓ కర్రను ఏర్పాటు చేశారు ఇలా.. వర్షాలు కురిస్తే భూమికి ఎర్తింగ్ వచ్చే ప్రమాదం ఉంది. ఈ విషయమై ఎన్పీడీసీఎల్ జనగామ రూరల్ ఏఈ మధును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. వెంటనే మిడిల్ స్తంభాన్ని ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, జనగామ రూరల్

నిలిచిపోయిన గూడ్స్ రైలు

కేసముద్రం, న్యూస్‌టుడే: విజయవాడ - కాజీపేట మార్గంలో వెళ్తున్న ఓ గూడ్స్ రైలు ఓవర్‌హెడ్ ఎలక్ట్రిఫికేషన్ (ఓహెచ్‌ఈ)లో సాంకేతిక లోపం ఏర్పడి తాళ్లపూసపల్లి, కేసముద్రం రైల్వే స్టేషన్ల మధ్య 428 కి.మీ. వద్ద శుక్రవారం ఉదయం 8.15 గంటలకు నిలిచిపోయింది. రైల్వే అధికారులు మరో రైలు ఇంజిన్‌ను కేసముద్రం నుంచి తెప్పించి ఆగిన గూడ్స్‌కు అమర్చడంతో 9.20 గంటలకు కదిలింది. ఆ మార్గంలో వెళ్తున్న పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. మహబూబాబాద్‌లో కోర్బా ఎక్స్‌ప్రెస్, సింగరేణి, డోర్నకల్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లు సుమారు గంటపాటు నిలిచిపోయాయి.

ప్రజల అర్జీలు పరిశీలించిన మంత్రి సురేఖ



లేబర్‌కాలనీ, న్యూస్‌టుడే: వరంగల్ ఓసిటీలోని తన క్యాంపు కార్యాలయానికి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం వచ్చారు. నగరంలోని పలు డివిజన్ల నుంచి నాయకులు, ప్రజలు తరలివచ్చి మంత్రికి విజ్ఞాపన పత్రాలు అందించారు. వరంగల్ వెంకట్రామా టాకీస్ సమీపంలోని శ్మశానవాటిక స్థలాన్ని కొందరు ఆక్రమించి భవనం కట్టి అద్దెకిచ్చారని మంత్రి దృష్టికి తెచ్చారు. కబ్జా అంశంపై వరంగల్ తహసీల్దారు ఎండీ ఇక్బాల్‌కు ఫోన్ చేసి మంత్రి ఫిర్యాదుకు సంబంధించిన అంశంపై తనకు పూర్తి వివరాలు కావాలని కోరారు. సమస్యల ఆధారంగా సంబంధిత అధికారులకు తగు ఆదేశాలిచ్చి అక్కడికక్కడే పరిష్కారానికి కృషి చేశారు.

హరిత పర్వతాలు.. పైన హిమాలయాలు...!



అక్కడి పరిసరాలన్నీ హరిత వర్ణంతో ముసుగేసినట్లు కనిపిస్తాయి. దేశ సరిహద్దుల్లో ఉన్న హిమాలయాలు లాగా హరిత కొండలు కనువిందు చేస్తాయి. ఆకాశం పైన ధవళ వర్ణంలో ఉన్న మేఘాలు మంచు కొండల్ని తలపిస్తున్నాయి. ధర్మసాగర్, వేలేరు, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల పరిధిలో విస్తరించిన ఇనుపరాతి గుట్టల ప్రకృతి రమణీయత కట్టిపడేస్తోంది. ఈత చెట్టును ఆవాసంగా మార్చుకుని ఉన్న గిజిగాని పక్షుల గూళ్లు ఆకాశంలో ఉన్న భ్రాంతి కలుగుతోంది. హనుమకొండ జిల్లా వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామ శివారులో తీసిన సుందర చిత్రాలు. – ఈనాడు, హనుమకొండ



చికెన్ ధరలు వెన్‌కాబ్ (కిలో వెల రూపాయలలో)		
ఫాం: 115	డ్రెస్డ్: 199	
రిటైల్: 137	స్కిన్‌లెస్: 226	

కేఎంసీలో పరిశోధనోత్సవం ప్రారంభం



క్విజ్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య విద్యార్థులు



అస్థిపంజరంతో ఫొటో..



సీపీఆర్‌తో ప్రాణాలు నిలపడం ఎలానో వివరిస్తూ..

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: కాకతీయ వైద్య కళాశాల ఎన్ఆర్ఐ భవనంలో 'కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్నోవేషన్స్' (కృతి) రెండో పరిశోధనా దినోత్సవ సదస్సు శుక్రవారం మొదలైంది. రాష్ట్రంలోనే మొదటి సారి అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థులను క్లినికల్ వైద్యంతోపాటు పరిశోధనల వైపు మళ్లించడానికి నిర్వహిస్తున్న ఈ సదస్సుకు రాష్ట్రం సహా, దేశం నలుమూలల నుంచి వచ్చిన వైద్యవిద్యార్థులు హాజరయ్యారు. కేఎంసీ యూఎస్ఏ అల్యుమిని, కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్నోవేషన్స్ కన్వీనర్ డాక్టర్ సుజిత్ ఆర్ పున్నం, డాక్టర్ వేణు జి.బత్తిని అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో మొదటిరోజు డిబేట్, హ్యాకథాన్, జెపార్డీ(ఇండియాలోనే అతిపెద్ద మెడ్ క్విజ్) పోటీలు నిర్వహించారు. వైద్యపరిశోధనకు ఉపయోగపడేలా ఆటపాటలతో కూడిన క్విజ్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఎన్ఆర్ఐ భవనం ఆవరణలో ఏర్పాటుచేసిన స్టాళ్లలో జూనియర్ వైద్యవిద్యార్థులకు సీనియర్ విద్యార్థులు వైద్య అవగాహన కల్పించారు. ఇందులో శరీర నిర్మాణం, డయాలసిస్ ద్వారా కృత్రిమ రక్తశుద్ధి విధానం, గుండె పనితీరు. కార్డియాక్ అరెస్టు అయిన వ్యక్తిని సీపీఆర్ చేయడం ద్వారా ఎలా బతికించొచ్చు అనే అంశాలపై అవగాహన కల్పించారు. వైద్య పరికరాలు, విజ్ఞానానికి సంబంధించి ఏర్పాటుచేసిన స్టాళ్లలో వైద్య పదజాలంతో కూడిన ఆటలు నిర్వహించారు.



వివిధ స్టాళ్ల వద్ద విద్యార్థులు

కేయూ ఈఈఈ పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగా సుమలత



ఉప కులపతి నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న సుమలత

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగం నూతన పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగా సహ ఆచార్యులు సుమలత నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత అధ్యక్షులు కె.చీనా నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించి, ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. సుమలతకు 14 ఏళ్ల బోధనానుభవం ఉంది. ఎన్ఎస్ఎస్ అధికారిగా, హాస్టల్ అదనపు సంచాలకులుగా, ఈఈఈ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహించారు. ఉప కులపతి ఆచార్య కె.ప్రతాపరెడ్డి నుంచి ఆమె నియామక ఉత్తర్వులు అందుకున్నారు.

సైకిల్ సవారీ.. ఆరోగ్యమేమరి..



డిజిటల్ మీటర్



సైకిల్‌పై రయ్ మంటూ వెళ్తున్న యువకుడు హనుమకొండలోని వికాస్‌నగర్‌కు చెందిన తోకల రాజురెడ్డి. తాను రోజూ భవన నిర్మాణ అవసరాల నిమిత్తం నగరంలో సైకిల్‌పైనే సుమారు 40 కిలోమీటర్లు తిరుగుతానని చెబుతున్నారు. దీనికి బ్యాటరీతో కూడిన మోటారు కూడా ఉండటంతో 15 కిలోమీటర్లు తొక్కుతూ.. మిగతాది బ్యాటరీ మోటారు ఆన్‌చేసి వెళ్తుంటానని తెలిపారు. ఒకసారి ఛార్జింగ్ చేస్తే 50 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేయొచ్చని చెప్పారు. సైకిల్‌కు ఏడు గేర్లు ఉంటాయని, హ్యాండిల్‌కు వేగాన్ని సూచించే డిజిటల్ మీటరు కూడా ఉంటుందన్నారు. ఇది వరకు తనకు బుల్లెట్ బండి ఉండేదని, దానికి ఇంధన ఖర్చు ఎక్కువ అవుతుండటంతో రెండు నెలల కిందట రూ.50 వేలు వెచ్చించి ఈ సైకిల్ కొన్నానని తెలిపారు. ప్రస్తుతం నెలకు సుమారు రూ.3 వేలకుపైగా ఆదా అవుతోందని, సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా ఉంటున్నానని ఉత్సాహంగా చెప్పారు. – ఈనాడు, హనుమకొండ

తాత్కాలికంగా ఆందోళన విరమణ


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

ములుగు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రెచ్ సెంటర్ల ఏర్పాటు, ఇతర సమస్యలకు సంబంధించి అధికారులు ఇచ్చిన హామీ మేరకు ఆందోళనను విరమిస్తున్నట్లు అంగన్‌వాడీ కార్మికుల ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం అంగన్‌వాడీ వర్కర్ల సంఘం ప్రతినిధులు జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకరను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ.. స్త్రీ శిశు సంక్షేమశాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఆకేశ్వర్‌రావు, జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా సంక్షేమాధికారి శిరీష ఇచ్చిన హామీ మేరకు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. క్రెచ్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి విధి విధానాలు వచ్చిన తర్వాతనే కేంద్రాలను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తే అదనపు వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె. సరోజన, కె. సమ్మక్క, నాయకులు ధనలక్ష్మి, వెంకటరమణ, పద్మారాణి, జమునరాణి, భాగ్యలక్ష్మి, రమాదేవి, పుష్ప, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

వివరాల సవరణ తరువాయే అపార్

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: పాఠశాలలో విద్యార్థి ప్రగతి, ఆధార్ నంబర్ మినహా సమస్త వివరాల వేదికకు విద్యా శాఖ 'అపార్' (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఏర్పాటు చేసింది. ఎప్పటికప్పుడు అప్రయత్నంగా నమోదు చేయడంతో పాటు 12 అంకెల విశిష్ట సంఖ్య గల గుర్తింపు సంఖ్య కోసం విద్యాశాఖ కసరత్తు చేస్తుంది. పలువురు విద్యార్థులకు ఆధార్ కార్డులో వివరాలు తేడాగా ఉండడం వీటిని సరిచేసాక, యూడైస్ ప్లస్‌లో సవరించాక విరగా అపార్‌లో నమోదుకు అధికారులు ప్రధానోపాధ్యాయులను సన్నద్ధం చేస్తున్నారు. అపార్‌లో నమోదయ్యాక మార్పుల సవరణకు కుదరదని అప్రమత్తం చేస్తున్నారు. కొన్ని బడుల ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి వివరాలను పరిశీలిస్తున్నారు.

ప్రయోజనం అధికం..

ఇటీవల కురిసిన ఖమ్మం వంటి జిల్లాల్లో పలు నివాస ప్రాంతాలు మునిగి, లోపల ఉన్న విద్యా పరమైన సర్టిఫికెట్లు పనికిరాకుండా పోయాయి. తర్వాత ప్రభుత్వం చర్యలు తీసుకున్నా, అపార్‌లో వివరాల నమోదు, 12 అంకెల విశిష్ట సంఖ్యతో సమస్త వివరాలు, సర్టిఫికెట్లు ఇందులో నిక్షిప్తమై ఉంటాయి. ఉన్నత విద్యకు దరఖాస్తు చేసుకున్నపుడు ఆధార్ నెంబరు సహా వివిధ అర్హతల ధ్రువపత్రాల నకళ్లను సమర్పించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆధార్ నెంబరును గోప్యంగా ఉంచడంతో పాటు అవసరమైన వివరాలే కనిపించేందుకు ఈ అపార్ అందుబాటులో ఉంటుంది. విద్యార్థి ప్రభుత్వం నుంచి పొందిన ఉపకార వేతనాలు, ఫీజు రాయితీలు తదితరాలు సహా అన్ని సర్టిఫికెట్లు ఇందులో నిక్షిప్తమై ఉంటాయి.


విద్యార్థి వివరాలు సరిచేస్తున్న మాధాపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అశోక్

☛ మూడు దశల్లో సవరణ చేయాలని అధికారులు ఉపాధ్యాయులకు చెబుతున్నారు. అడావుడి లేకుండా స్పష్టమైన వివరాలు భర్తీ చేయాలని సూచిస్తున్నారు.

వివరాలిలా..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
జనగామ	508	65,206
భూపాలపల్లి	432	20,870
ములుగు	510	32,082

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140
ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

వాజేడు, న్యూస్‌టుడే: ధర్మారంలోని మసీదు రోడ్డులో ఏర్పడిన గుంతలతో ఇబ్బందులు పడుతున్నాం. మొరం నింపి మరమ్మతులు చేపట్టండి. - **చంద్రశేఖర్, ధర్మారం**

పరిశీలించి గుంతలలో మొరం నింపేందుకు చర్యలు తీసుకుంటాం.. - **నరేశ్, కార్యదర్శి, ధర్మారం పంచాయతీ**

దోమల నివారణకు చర్యలు

స్పందనకు వందనం

ములుగు రూరల్: ములుగు మండలం భూపాల్‌నగర్ గ్రామంలోని మురుగు కాలువలు, పాఠశాలల ఆవరణలో వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలు వ్యాప్తి పెరిగిందని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించారు. సిబ్బందితో దోమల నివారణకు బ్లీచింగ్ పోడి చల్లించారు

పైప్ లైన్‌కు మరమ్మతు



పస్రా,(గోవిందరావుపేట): మండలంలోని పస్రా గ్రామ రెండో వార్డులో పైప్‌లైన్ లీకేజీతో తాగు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వార్డులోని ప్రజలు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఆ విషయాన్ని 'న్యూస్‌టుడే' పంచాయతీ కార్యదర్శి శ్వేతకు వివరించగా, ఆమె స్పందించారు. పంచాయతీ సిబ్బందిచే పైప్ లైన్‌కు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

తాగునీటి వృథాకు అడ్డుకట్ట



ఏటూరునాగారం: ఏటూరునాగారంలోని శివాలయం వీధిలో ప్రధాన రహదారి పక్కన గల తాగునీటి పైపులైను పగిలి తాగునీరు వృథా అవుతుందని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు వివరించారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి రమాదేవి దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించారు. సిబ్బందిని అప్రమత్తం చేసి సంబంధిత పైపులను తవ్వించి మరమ్మతులు చేయించారు. తాగు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకున్నారు.

గడ్డిమందు పిచికారీ



అకినేపల్లిమల్లారం (మంగపేట): మండలంలోని అకినేపల్లి మల్లారం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో పంచాయతీ అధికారులు గడ్డిమందు పిచికారి చేయించారు. ఈనెల 24న 'ఈనాడు'లో 'పాఠశాలలో విష పురుగుల సంచారం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి ఆమని తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. పాఠశాల ఆవరణలో గడ్డి మందు పిచికారి చేయించారు.

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదే


మాట్లాడుతున్న ఎస్సై తాజుద్దీన్

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేయకుండా వారి పోషణ చేపట్టి బాగోగులు చూసుకోవాలని ఎస్సై తాజుద్దీన్ సూచించారు. పోలీసుల ఫ్లాగ్ డే సందర్భంగా ఏటూరునాగారం మండలంలోని రొయ్యూరు గ్రామ ప్రజలతో మమేకమయ్యారు. గ్రామంలోని పలు సమస్యలను తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరింప జేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, పోలీసులు చూపించిన ప్రతిభ, త్యాగాలు తదితర విషయాలను ప్రజలకు తెలియజేశారు. విద్యార్థులు చరవాణుల్లో సమయాన్ని వృథా చేస్తున్నారని, లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకుసాగాలన్నారు. మాదకద్రవ్యాలు లేని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు.

అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం



ద్విచక్ర వాహన ర్యాలీ ప్రారంభిస్తున్న బెటాలియన్ కమాండెంట్ అలెక్స్

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని పస్రాలోని ఐదో పోలీసు బెటాలియన్ కమాండెంట్ టి.అలెక్స్ అన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని ఐదో పోలీసు బెటాలియన్ నుంచి పోలీసులు ద్విచక్రవాహన ర్యాలీని చేపట్టారు. ర్యాలీని అలెక్స్ ప్రారంభించారు. పోలీసులు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తూ.. పోలీసు అమరవీరులకు జోహార్లు అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. బెటాలియన్ హెడ్ క్వార్టర్స్ నుంచి పస్రా గ్రామం వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎన్.పెద్దబాబు, సహాయ కమాండెంట్ అనిల్‌కుమార్, ఆర్ఐలు కార్తీక్, సాల్మన్‌రాజు, శ్రీనివాసులు, అన్నయ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాలు శుభ్రం



ములుగు రూరల్, న్యూస్‌టుడే: ములుగు మండలం జాకారం గ్రామంలోని పురాతన శివాలయాన్ని ఉపయోగంలోని తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర అధికారులను ఆదేశించారు. శివాలయాన్ని ఈ నెల 17వ తేదీన పరిశీలించగా, ఆలయ పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అధ్వానంగా ఉండడంతో.. త్వరితగతిన ఆలయ పరిసరాలను శుభ్రం చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి రమాదేవి శివాలయం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను జేసీబీ, ట్రాక్టర్ డోజర్లతో తొలగించారు. ఆలయాభివృద్ధికి ప్రతిపాదనలు సమర్పించాలని పురావస్తు శాఖ అధికారులకు గతంలో సూచించారు.

ప్రభుత్వ భూములపై పర్యవేక్షణ తప్పనిసరి


తహసీల్దార్ కార్యాలయ భవన పనులను పరిశీలిస్తున్న మహేందర్‌జీ

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: రూ.65 లక్షలతో నిర్మాణం చేపట్టిన కొత్త తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ బి.మహేందర్‌జీ పరిశీలించారు. ఏటూరునాగారం మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఎక్కడున్నాయో తహసీల్దార్ జగదీష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతన భవన నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారును పిలిచి వివరాలు సేకరించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పర్యవేక్షణ చేయాలని, తహసీల్దార్ కార్యాలయాన్ని సర్వే చేయించి నివేదిక అందించాలన్నారు. సంబంధిత భూమి పరాధీనం కాకుండా చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు ప్రతిపాదనలు చేయాలని సూచించారు. ఆర్ఐ కిరణ్, సిబ్బంది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం


జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవికుమార్, శ్రేణులు

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: కేంద్రంలో భాజపా ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, ఈ నేపథ్యంలో ప్రజలు, ప్రజాస్వామివాదులు, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పోరాటాలను ఉద్ధృతం చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. గోవిందరావుపేట మండలం పస్రాలో సీతారాం ఏచూరి నగర్‌లో శుక్రవారం సీపీఎం పార్టీ ఎనిమిదో మండల మహాసభను గుండు రామస్వామి, కోటె కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సీపీఎం నాయకుడు గజ్జి నర్సయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మరణించిన అమరవీరుల సంస్మరణార్థం మౌనం పాటించి నివాళులర్పించారు. ఆ తర్వాత నిర్వహించిన మండల సభకు ముఖ్యఅతిథిగా హాజరైన రవికుమార్ మాట్లాడుతూ.. భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగానికి వ్యవసాయపరంగా అవసరమైన ఎరువులు, పురుగుమందులు ధరలు పెంచిందని, సామాన్యులకు అవసరమైన ఆహార రాయితీలను, ఉపాధి హామీ పథకంలో కోతలు విధించిందన్నారు. నిరుద్యోగాన్ని పెంచే విధానాలను వేగవంతం చేస్తుందని, పలు ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న 45 వేల ఉద్యోగాలను భర్తీ చేయడం లేదన్నారు. సమస్యలను పరిష్కరరించడంలో భాజపా విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ.. కేంద్రం వద్ద నుంచి రావాల్సిన నిధులను రాబట్టేందుకు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. మహాసభలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి, నాయకులు బి.సాంబశివ, పి.చిట్టిబాబు, ఆర్.రాజేందర్, కె.రఘుపతి, జి.రాజేశ్, ఎ.మురళి, ఐలయ్య, ఎస్.చంద్రారెడ్డి, కె.రాజేశ్వరీ, పి.అరుణ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా నాని



వెంకటాపురం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగం మండల అధ్యక్షుడిగా రావుల నానిని నియమించారు. ఈ మేరకు భద్రాద్రికొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్య, జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మన్ చింతిరాల రవికుమార్ నియామక పత్రం అందించినట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియామకానికి తోడ్పాటు అందించిన టీపీసీసీ సభ్యుడు దుర్గాప్రసాద్, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌లోకి భారాస నాయకుడు

వెంకటాపూర్, న్యూస్‌టుడే: భారాస జిల్లా నాయకుడు భాషబోయిన పోశాలు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరాడు. మండల అధ్యక్షుడు చెన్నోజ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సొంతగూటికి పోశాలు రావడంతో కాంగ్రెస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మల్లాడి రాంరెడ్డి, ములుగు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్, జిల్లా నాయకుడు మిల్కూరి ఐలయ్య, రవి, శ్రీనివాస్, కోటి తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా 'ఎస్‌జీఎఫ్‌ఐ' ఎంపిక పోటీలు


కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) అండర్-19 క్రీడా ఎంపిక పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నాలుగు రోజులపాటు జరిగే క్రీడా పోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న జూనియర్ కళాశాలల క్రీడాకారులు హాజరయ్యారు. ముఖ్యఅతిథులుగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ. క్రీడల కోటాలో ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాలు పొందవచ్చని తెలిపారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు ఏర్పడతాయని తెలిపారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ. విజయమే లక్ష్యంగా క్రీడాకారులు ఆడాలని, రాష్ట్ర, జాతీయస్థాయిలో జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు. హనుమకొండకు చెందిన ఇరిగేసి అర్జున్ ప్రపంచ పోటీల్లో రాణిస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.25 లక్షల నజరానా అందించారని గుర్తు చేశారు. అనంతరం కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. ఈనెల 25, 26, 28, 29 తేదీల్లో క్రీడా పోటీలు ఉంటాయని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, హనుమకొండ, వరంగల్ జిల్లాల ఇంటర్మీడియట్ అధికారులు గోపాల్‌రావు, శ్రీధర్, పీడీలు గోపీ, సతీష్, ప్రభాకర్, శ్యాంప్రసాద్, ప్రభాకర్ రెడ్డి, లిల్లీఫ్లొరెన్స్, డీఎస్‌ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండలంలోని గంగారంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన గౌరబోయిన చంద్రయ్య కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సాయమందించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కల్యాణి, నాయకులు ఎండీ ముజాఫర్, పాక సాంబయ్య, పాక రాజేందర్, భూషణబోయిన రవికుమార్, అనుమాండ్ల రాజిరెడ్డి, ఆలేటి జైపాల్‌రెడ్డి, యానాల సిద్ధిరెడ్డి, గంట సాయిరెడ్డి తదితరులు గంగారానికి వెళ్లి చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల నగదు, నిత్యావసరాలు అందజేశారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు


ధర్మారంలో పురుగు మందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయాధికారి మహేశ్

వాజేడు, న్యూస్‌టుడే: అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి మహేశ్ అన్నారు. వాజేడు మండలంలోని పలు దుకాణాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఎరువుల విక్రయాలు జరుపుతున్న దుకాణాలలో ఈపోస్ యంత్రాలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. స్టాక్ రిజిష్టర్లను సక్రమంగా నిర్వహించాలని, వినియోగదారులకు తప్పనిసరిగా బిల్లును అందజేయాలని పేర్కొన్నారు. దుకాణాల తనిఖీలో వ్యవసాయ విస్తరణాధికారి హరీశ్ ఉన్నారు.

కెపాసిటర్లతో నాణ్యమైన విద్యుత్తు


పత్తిపల్లిలో పొలం బాటలో భాగంగా నియంత్రికను పరిశీలిస్తున్న డీఈ నాగేశ్వర్‌రావు

ములుగు, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో విద్యుత్తు సరఫరాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు అధికారులు పొలం బాట పట్టారు. శుక్రవారం డివిజనల్ ఇంజినీర్ పి.నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ములుగు మండలంలోని బండారుపల్లి, పత్తిపల్లి గ్రామాల్లో క్షేత్ర పర్యటన చేశారు. రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సరఫరాలో అంతరాయం, వైర్లు, నియంత్రికలు, తదితర సమస్యల గురించి రైతులతో చర్చించారు. వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని, దీంతో వోల్టేజి సమస్య నియంత్రించొచ్చని, విద్యుత్ నియంత్రికలపై భారం పడకుండా ఉంటుందని వివరించారు. సరఫరాకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఏఈ వెంకటరెడ్డి, సబ్ ఇంజినీర్ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


సంఘటనాస్థలంలో ధ్వంసమైన లారీ

వాజేడు, న్యూస్‌టుడే: రెండు ఇసుక లారీలు ఢీకొన్న సంఘటనలో ఓ లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడి, మరోలారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలైన సంఘటన వాజేడు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండలంలోని చీకుపల్లి వంతెనపై హైదరాబాద్ నుంచి ఇసుకలోడుతో వేగంగా వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న మరోలారీని ఢీకొట్టడంతో ముందుభాగం ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ చిట్టిపాక కృష్ణ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి గంట సేపు నరక యాతన అనుభవించాడు. సమాచారం మేరకు ఏఎస్సై లతీఫ్, హెడ్ కానిస్టేబుల్ హరిప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను స్థానికుల సాయంతో బయటకు దించారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఏటూరునాగారం తీసుకెళ్లి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందజేయాలి

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం జీసీడీవో రమాదేవి, మండల విద్యాధికారి కేశవరావు తనిఖీ చేశారు. విద్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థినుల సామర్థ్యాలను అంచనా వేసి వారికి పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలని ప్రత్యేక అధికారిని పుష్పనీలకు సూచించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

డిగ్రీ కళాశాల తనిఖీ


అధ్యాపకులతో మాట్లాడుతున్న న్యాక్ బృందం

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: నేషనల్ అక్రెడిటేషన్ అండ్ అసెస్‌మెంట్ మండలి సభ్యులు శుక్రవారం ఏటూరునాగారంలోని గిరిజన గురుకుల బాలికల డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ బృందంలో తమిళనాడులోని కర్పంగా అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉప కులపతి డా.వెంకటచలపతి, న్యూదిల్లీలోని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం డా.నారాయణప్రసాద్, మహారాష్ట్ర రాష్ట్రంలోని రాయ్‌గఢ్ షేత్ జేఎన్ పలివాల కళాశాల డా.సుధాకర్ ఉన్నారు. కళాశాలను సందర్శించిన న్యాక్ బృందానికి ప్రిన్సిపల్ డా.రాధిక ఐదేళ్లుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. న్యాక్ బృందం కళాశాలలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి ఆయా డిపార్ట్‌మెంట్ల హెచ్‌వోడీలతో మాట్లాడి పలు సూచనలు చేశారు. విద్యార్థుల నాణ్యత ప్రమాణాలు, గ్రేడులు, ఫలితాలు, పర్సంటేజీలు తెలుసుకున్నారు. కళాశాల రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. గురుకులాల సంఘం నుంచి ప్రత్యేకాధికారిగా డా.సతీష్‌గౌడ్, డా.నీరజ హాజరయ్యారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహనతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం


వెంకటాపురం మండలం తిప్పాపురం గ్రామంలో

వెంకటాపురం, న్యూస్‌టుడే: చలిగాలులు వీస్తున్న దృష్ట్యా చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని వైద్యులు పేర్కొన్నారు. శుక్రవారం పలు చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించారు. వెంకటాపురం మండలంలోని తిప్పాపురం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఉప కేంద్రం పరిధిలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఇంటింటి సందర్శన చేసి జ్వర బాధితుల వివరాలు సేకరించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగుంపు, చినగంగారం, ఆలుబాక జడ్పీఎస్ ఉన్నత పాఠశాలల్లో వైద్యులు పవన్‌కల్యాణ్, ఆశీశ్, ఎంఎల్‌హెచ్‌పీ మనోహర్, జ్యోతి, వైద్య సిబ్బంది యాకలక్ష్మీ, సత్యనారాయణ తదితరులు సేవలందించారు.


వాజేడు మండలంలో

వాజేడు: మండల పరిధిలోని ప్రగళ్లపల్లి, బొల్లారం గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించారు. బొల్లారంలో అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ ప్రగళ్లపల్లి పల్లెదవాఖాన వైద్యులు జ్ఞానస ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. మాతాశిశు సంరక్షణ వైద్య బృందం ఆధ్వర్యంలో ప్రగళ్లపల్లిలో నిర్వహించిన శిబిరంలో 32 మందిని పరీక్షించారు. గర్భిణులకు పలు సూచనలు చేశారు. వైద్యపర్యవేక్షకులు వెంకటరమణ, కోటిరెడ్డి, వైద్య సహాయకుడు శ్రీనివాస్, వైద్యసిబ్బంది కన్యాకుమారి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

మంచినీటి సమస్య ఏర్పడకుండా చూడాలి


పనులను పరిశీలిస్తున్న ఎంపీవో శ్రీకాంత్

వాజేడు, న్యూస్‌టుడే: రక్షిత మంచి నీటి పథకాలను ఎంపీవో శ్రీకాంత్ పరిశీలించారు. వాజేడు మండల పరిధిలోని పెద గొల్లగూడెం రక్షిత మంచి నీటి పథకాన్ని తనిఖీ చేసి క్లోరినేషన్ పనులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పంచాయతీ పరిధిలోని గ్రామాలలో మంచినీటి సమస్య ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.